సాక్షి సంగారెడ్డి
బుధవారం । 25 । జూన్ । 2025



పైసలిస్తేనే ప్లాట్

టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటోనగర్ స్థలాల కేటాయింపులో దళారుల ఇష్టారాజ్యం. వివరాలు 8లో ▸



జోరుగా మట్టిదందా

అధికారుల అలసత్వంతో కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లో యథేచ్ఛగా మట్టి దందా కొనసాగుతోంది. వివరాలు 8లో ▸



'అంగన్‌వాడీ'లకు తాళాలు

అధికారులు పట్టించుకోకపోవడంతో హత్నూర మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. వివరాలు 9లో ▸

రిజర్వేషన్లపై ఉత్కంఠ

- తమస్థానం ఏ సామాజికవర్గానికి రిజర్వు అవుతుందోనని సందిగ్ధం
- అయోమయంలో ఆశావహులు, ద్వితీయ శ్రేణి నాయకులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: స్థానిక సంస్థలకు సంబంధించిన రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీలతోపాటు సర్పంచ్‌లుగా పోటీ చేయాలనుకునే ఆశావహులు తమ గ్రామ పంచాయతీ, తమ ప్రాదేశిక ప్రాతినిధ్య నియోజకవర్గం ఏ వర్గానికి రిజర్వు చేయబడుతుందోననే అయోమయంలో ఉన్నారు. కొన్ని నెలలుగా ఈ రిజర్వేషన్ల విషయంలో నెలకొన్న గందరగోళంతో చాలామంది నేతలు నిరుత్సాహంలో ఉన్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థానిక సంస్థల రిజర్వేషన్లను నెల రోజుల్లో ఖరారు చేస్తామని ఇటీవల హైకోర్టుకు విన్నవించింది. ఈ నేపథ్యంలో ఆశావహుల్లో ఆశలు రేకెత్తినట్లయింది. రోటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఉండే అవకాశాలుండటంతో ఆయా పాతస్థానాలకు కొత్త రిజర్వేషన్లు రానున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 631 గ్రామ పంచాయతీలున్నాయి. అలాగే 27 మండలాలుండగా..అందులో అమీన్‌పూర్ మండలం పూర్తిగా అర్బన్ మండలంగా మారిన విషయం తెలిసిందే. దీంతో 26 ఈసారి జెడ్పీటీసీ స్థానాలు 26కే పరిమితం కానున్నాయి. అలాగే 271 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. 1,528 పోలింగ్ కేంద్రాలను గుర్తించగా, సుమారు 14.45 లక్షల మంది ఓటర్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లున్నారు.



సంగారెడ్డి జెడ్పీ కార్యాలయం

కాపాడుకునేందుకు తంటాలు..

రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకపోవడంతో ఆయా గ్రామాల్లోని కీలక నాయకులు, మండలాల్లో పట్టున్న నేతలు తమ అనుచరులను కాపాడుకోవడం కష్టంగా మారింది. ఏ సామాజికవర్గానికి రిజర్వేషన్ వస్తుందో ఇప్పుడే తెలియకపోవడంతో అన్ని సామాజికవర్గాలకు చెందిన అనుచరులను తమ వెంట తిప్పుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. రిజర్వేషన్ తమకు అనుకూలంగా వస్తే తానే బరిలోకి దిగేలా..వేరే సామాజికవర్గానికి రిజర్వేషన్ వస్తే ఆ సామాజికవర్గానికి చెందిన తన అనుచరుడిని రంగంలోకి దింపేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. జిల్లాలో సర్పంచుల పదవీకాలం పూర్తయి ఏడాదిన్నర అవుతోంది. 2024 జనవరి నెలాఖరుతో వీరి పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి గ్రామ పంచాయతీలకు అధికారులే పర్సన్ ఇన్‌చార్జిలుగా ఉన్నారు. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ పదవీకాలం ముగిసి కూడా ఏడాది దగ్గర పడుతోంది. 2024 జూలై మొదటి వారంలో ఈ స్థానిక సంస్థల పదవీకాలం ముగిసింది. ఇప్పటి వరకు పర్సన్ ఇన్‌చార్జిల పాలనలోనే జిల్లా, మండల పరిషత్‌లు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

గురుకులాలపై నజర్

- ఏఐ టెక్నాలజీ, సీసీ కెమెరాలు
- ఎస్సీ గురుకులాల్లో ఏర్పాట్లు
- విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి
- బెంగ తీర్చేందుకు 'ఫోన్ మిత్ర'


నారాయణఖేడ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకులం

నారాయణఖేడ్: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల భద్రత, ఆహార కల్తీ, పర్యవేక్షణలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా ఎస్సీ గురుకులాల్లో పలు సంస్కరణలను అమలు చేస్తున్నారు. భవిష్యత్తులో మిగతా గురుకులాల్లోనూ సైతం ఈ సంస్కరణలను అమలు చేయనున్నారు. గత విద్యా సంవత్సరం చివరలో రాష్ట్రంలో పలు గురుకులాల్లో ఆహార కల్తీ, విద్యార్థుల భద్రతలపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ప్రతిపక్షాలు సైతం ఈ అంశాన్ని ప్రత్యేకంగా లేవనెత్తి రాజకీయంగా పైచేయి సాధించాయి. ఈ ఘటనల దరిమిలా గురుకులాల్లోని విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం మరింత దృష్టి సారించింది. దీంతో జిల్లాలోని గురుకులాల విద్యార్థులకు సైతం సంస్కరణలు ప్రయోజనం చేకూరనున్నాయి.

సీసీ కెమెరాల పర్యవేక్షణ..

జిల్లాలో 12 ఎస్సీ గురుకులాలు ఉండగా ఇందులో 7 గురుకులాలు బాలుర, 5 గురుకులాలు బాలికలకు సంబంధించినవి ఉన్నాయి. నల్లవాగు, హత్నూర, నారాయణఖేడ్, కొండాపూర్, సింగూరు, హత్నూర కళాశాల, న్యాల్‌కల్‌లో బాలుర, చిట్కుల్, ఇస్నాపూర్, జహీరాబాద్, ఆందోల్, రాయికోడ్‌లలో బాలికల గురుకులాలు కొనసాగుతున్నాయి. ఒక్కో గురుకులంలో 400 నుంచి 600మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా, గురుకులాల్లో విద్యార్థుల భద్రత, ఆహార కల్తీ, వంటి వాటిపై అత్యాధునిక ఏఐ టెక్నాలజీ, హై రిజుల్యూషన్ కలిగిన 20 నుంచి 30వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కెమెరాలను లైవ్‌లో చూసేందుకు మాసాబ్ ట్యాంక్ సంక్షేమ భవన్‌లోని ఎస్సీ గురుకులాల సొసైటీ కేంద్ర కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. కెమెరాల ఫీడ్‌ను పర్యవేక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేస్తూ ప్రిన్సిపాల్స్, వార్డెన్లను అప్రమత్తం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జోనల్ కేంద్రాలు, కలెక్టర్లకు కూడా యాక్సెస్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.

నెలరోజుల్లో ఓ కొలిక్కి

నెల రోజుల్లో కెమెరాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. బాలికల గురుకులాల్లోని పురుష బోధన, బోధనేతర సిబ్బందిని ఇప్పటికే వాటి నుంచి బదిలీ చేశారు. బాలికల గదుల్లోకి వాచ్‌మెన్లు వెళ్తున్నారని, రాత్రి వేళల్లో విద్యార్థులు బయటకు వెళ్తున్నారన్న ఫిర్యాదులు రాష్ట్రస్థాయిలో రావడాన్ని ప్రభుత్వం గుర్తించింది. మరోవైపు గురుకులాల్లో తరచూ ఆహారం కల్తీ అవుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. హాస్టళ్లలో కిచెన్, భోజనం చేసే ప్రాంతాలు పరిశుభ్రంగా లేకపోవడం, కాంట్రాక్టర్లు నాసిరకమైన వస్తువులు, సరుకులు సరఫరా చేయడం వంటి సమస్యలకు సీసీ కెమెరాల ఏర్పాటుతో చెక్ పెట్టవచ్చని ప్రభుత్వ భావిస్తోంది. ముఖ్యంగా తమ పిల్లలు సురక్షితమైన వాతావరణంలో ఉన్నారనే భరోసాను తల్లిదండ్రులకు లభిస్తుందని భావిస్తున్నారు.



బెంగ తీర్చేందుకు ఫోన్‌మిత్ర

తల్లిదండ్రులకు దూరంగా గురుకులాల్లో ఉండే విద్యార్థులకు ఇంటిపై బెంగపెట్టుకుని చదువుపట్ల శ్రద్ధ చూపకపోవడం వంటి సమస్యలను నివారించేందుకు విద్యార్థులకు ఫోన్ మాట్లాడుకునే సదుపాయాన్ని కూడా ప్రభుత్వం నూతనంగా ఈ గురుకులాల్లో ఫోన్ మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది. అన్ని గురుకులాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 7 నుంచి 10 టెలిఫోన్ బాక్సులను గురుకులాల్లో ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు విద్యార్థులు పాఠశాలలో ఉండే సమస్యలు, తోటి విద్యార్థులతో ఏమైనా సమస్యలు ఉన్నా, భోజనం, వసతి, అభ్యసనంకు సంబంధించిన సమస్యలు, మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థుల కోసం సహాయ కేంద్రానికి సైతం ఫోన్ చేసి చెప్పవచ్చు. ఏ గురుకులంలో ఏయే సమస్యలు ఉన్నాయో విద్యార్థుల ద్వారా ఉన్నతాధికారులు సైతం గుర్తించే అవకాశం కలుగుతుంది.

న్యూస్‌రీల్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్


విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్, తదితరులు

సంగారెడ్డి జోన్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. పట్టణంలో కళాశాల విద్యార్థులతో కలిసి మంగళవారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన వారోత్సవాల్లో భాగంగా 'మిషన్ పరివర్తన- నిషాముక్త భారత్'లో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ మత్తు పదార్థాలకు బానిస కాకూడదన్నారు. ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కొత్త మున్సిపల్ కమిషనర్లు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్లు

పటాన్‌చెరు: తెల్లాపూర్, గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్లుగా ఇటీవల బదిలీపై వచ్చిన అజయ్ కుమార్ రెడ్డి, వెంకట రామయ్యలు మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీల అభివృద్ధిలో కమిషనర్లది అత్యంత కీలక పాత్రని..నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బాల్‌రెడ్డి, సోమిరెడ్డి, మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం లారీ పట్టివేత


అధికారులు సీజ్ చేసిన బియ్యం లారీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జీబ్లాక్‌లో అనుమానాస్పదంగా బియ్యం లోడ్‌తో ఉన్న లారీను మంగళవారం పౌరసరఫరాల శాఖ అధికారులు, కొల్లూరు పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. తెల్లాపూర్‌లోని జీ బ్లాక్‌లో బియ్యంలోడ్‌తో ఓ లారీ ఉందన్న సమాచారంతో అధికారులు అక్కడకు చేరుకుని లారీని పరిశీలించారు. అవి రేషన్ బియ్యమా కాదా అనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. కాగా, సీజ్ చేసిన లారీని పటాన్‌చెరులోని సివిల్ సప్లై గోదాంకు తరలించారు. ఈ విషయమై డీఎస్‌ఓ బాలసరోజను వివరణ కోరగా..బియ్యం లోడ్ ఉన్న లారీని సీజ్ చేశామని సుమారు 200క్వింటాల బియ్యం ఉండవచ్చు అని తెలిపారు. అవి రేషన్ బియ్యమని తేలితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన


సరాఫ్‌పల్లి పాఠశాలలో డీఈఓ వెంకటేశ్వర్లు

సంగారెడ్డి: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరగాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ, మధ్యాహ్న భోజనంకు సంబంధించిన వివరాలను హెడ్మాస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేఎన్టీయూ సుల్తాన్‌పూర్ కళాశాలలో జవహర్ నవోదయ విద్యాలయంకు సంబంధించి తాత్కాలిక ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన వెంట మండల విద్యాధికారి బాలయ్య సిబ్బంది ఉన్నారు.

సాగును పండగలా చేసిందే కాంగ్రెస్

- రూ.9 వేల కోట్లకుపైగా రైతుభరోసా డబ్బులు జమ
- మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

వట్‌పల్లి(అందోల్): వ్యవసాయాన్ని పండగలా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఆందోల్ వ్యవసాయ క్లస్టర్ సంగుపేట గ్రామంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు పండుగ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని వీడియో సదస్సు ద్వారా వీక్షించారు. అనంతరం మంత్రి దామోదర మాట్లాడుతూ..గతంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడి సహాయాన్ని అందించి రైతులకు అండగా నిలిచామని తెలిపారు. రైతు భరోసా పథకంతో పాటు సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీలాంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన ఘనత సీఎం రేవంత్ సారథ్యంలోని ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ప్రజాప్రభుత్వం 18 మాసాల్లోనే సుమారుగా రూ.80 వేల కోట్లకు పైగా నిధులను రైతుల సంక్షేమం కోసం వెచ్చించిందని వెల్లడించారు. రైతు సుభిక్షంగా ఉండాలని విశ్వసించే కాంగ్రెస్ నాడు ఉమ్మడి ఏపీ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీరు అందించిందని గుర్తు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర

జిల్లాలో 3,12,879మంది రైతులకు రైతు భరోసా

సంగారెడ్డి జిల్లాలో 3,12879మంది రైతుల ఖాతాలలో ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.383.48 కోట్లను పెట్టుబడి డబ్బులు రైతు భరోసా పథకం కింద జమ చేసినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో రైతుభరోసా 95 శాతం మంది రైతులకు అందజేసినట్లు త్వరలో మిగిలిన ఐదు శాతం మంది రైతులకు కూడా రైతుభరోసా అందించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ...జిల్లాలో రైతుభరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతులు రైతుభరోసా డబ్బులను వినియోగించుకుని నాణ్యమైన ఎరువులు, విత్తనాలను గుర్తింపు పొందిన లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీవో పాండు, సంబంధిత శాఖల అధికారులు రైతులు, రైతు సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు నోచుకోని నల్లవల్లి

జిన్నారం (పటాన్‌చెరు): భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు విజయవంతంగా ముగియగా ఒక్క నల్లవల్లి మాత్రం అందుకు మినహాయింపుగా మారింది. రెవెన్యూ అధికారులు ప్రతీ గ్రామాన్ని ఎంపిక చేసి భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులను స్వీకరించారు. కానీ, నల్లవల్లి గ్రామానికి మాత్రం అధికారులు ఆ అవకాశాన్ని కల్పించలేదు. దీంతో తమ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డ్ సమస్యను అడ్డం పెట్టుకుని నల్లవల్లి గ్రామంలో నిర్వహించవలసిన సదస్సు గుమ్మడిదల రైతు వేదికలో నిర్వహించడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. సదస్సులకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పినా కూడా నిర్వహించకపోవడం పట్ల రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్లో ఈ నెల 29న నిర్వహించే జాబ్ మేళా కార్యక్రమాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు డియోస్ ప్రధాన కార్యదర్శి తలారి ప్రసాద్ సూచించారు. దౌల్తాబాద్‌లో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు సాయి కృష్ణ గార్డెన్స్‌లో 60 పరిశ్రమల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమాతో పాటు డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తం

కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఆదేశించారు. వానకాలం సీజన్‌లో భాగంగా రైతులకు ఎరువులు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. భూ భారతిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సీఐటీయూని గెలిపించండి

కాజిపల్లి టీఐటీసీ పరిశ్రమ గేట్ మీటింగ్‌లో చుక్కారాములు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమ కార్మిక ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పేర్కొన్నారు. మండలంలోని కాచిపల్లి టీఐటీసీ పరిశ్రమలో మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక శ్రేయస్సుకు నిరంతరం సీఐటీయూ యూనియన్ కృషి చేస్తుందన్నారు. యూనియన్ ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు. మెరుగైన నాలుగు వేతన సవరణలు చేసిన యూనియన్ సీఐటీయూ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యవర్గ సభ్యులు రాజయ్య, భాస్కర్ రెడ్డి, మాణిక్యం, వేణుగోపాల్, శేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

వృత్తి నైపుణ్యంతోనే రాణింపు

ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి జోన్: వృత్తి నైపుణ్యంతోనే విధుల్లో రాణించగలమని ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన పోలీస్ డ్యూటీ మీట్‌లో భాగంగా ఆర్ముడ్ రిజర్వ్ డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజబుల్ బృందాల పనితీరును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జోనల్ స్థాయిలో నిర్వహించే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్డీఎస్పీ నరేందర్, వివిధస్థాయి అధికారులు పాల్గొన్నారు.


డాగ్ స్క్వాడ్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

పలు మున్సిపాలిటీలకు కొత్త కమిషనర్లు

జిన్నారం(పటాన్‌చెరు)/జోగిపేట(అందోల్)జహీరాబాద్ టౌన్/రామచంద్రాపురం(పటాన్‌చెరు): జిల్లాలో వివిధ మున్సిపాలిటీలకు నూతన కమిషనర్లు నియమితులయ్యారు. గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామయ్య, బొల్లారంకు కిషన్, గుమ్మడిదలకు అజిత్ కుమార్‌రెడ్డి, అందోల్- జోగిపేటకు యూ.గురులింగం, జహీరాబాద్‌కు దేశ్‌ముఖ్ సుభాష్‌రావు, తెల్లాపూర్‌కు అజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


అజయ్‌కుమార్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న సంగారెడ్డి

కౌలు కష్టాలు సర్కారుకెరుక!

- పెరిగిన కౌలు ధరలు
- అందని ప్రభుత్వ సహాయం

పొలం కౌలుకు తీసుకుని పంటలను సాగు చేస్తున్న కౌలు రైతులకు కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. ప్రతీ ఏటా కౌలు, పెట్టుబడి ధరలు పెరిగిపోతుండటంతోపాటు కౌలు రైతుల పేరున ఎటువంటి పత్రాలు లేవన్న కారణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కూడా అందకపోవడంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మూలిగే నక్కమీద తాటిపండు పడట్టుగా రూ.వేల పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తే చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధర లేక కుదేలవుతున్నాడు.

– జహీరాబాద్ టౌన్:

జిల్లాలో జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాలు ఉండగా సుమారు 2.67 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో కౌలు రైతులు సుమారు 42 వేల మంది ఉన్నారు. రైతు భరోసా తీసుకుంటూ పంటలు సాగు చేయలేని రైతులంతా ఎకరానికి రూ.10 నుంచి రూ.20 వేలు తీసుకుంటూ భూమిని కౌలుకు ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు 2024 రబీ సీజన్‌లో పట్టాభూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా పూర్తిగా ఇవ్వలేదు. మూడు ఎకరాల వరకు ఉన్న రైతులకు మాత్రమే డబ్బులు జమయ్యాయి. సాంకేతిక కారణాల వల్ల 42% మంది రైతులకు రాలేదు. రైతు భరోసా అందని వారు ఎకరానికి రూ.5 వేల వరకు భూమిని బట్టి కౌలు పెంచారు. సారవంతమైన నల్లరేగడి నేలలు కలిగిన భూములకు ఎకరానికి రూ.25 వేల వరకు కౌలు నిర్ణయించారు.


పొలం దున్నుతున్న కౌలు రైతు(ఫైల్)

అమలు కాని హామీలు!

కౌలు రైతులను ఆదుకుంటామని చెబుతున్న ప్రభుత్వాలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి సాగు యోగ్యం కాని భూముల వివరాలను సేకరించింది. దీని ఆధారంగా తొమ్మిది రోజుల నుంచి రైతుల ఖాతాలో రైతు భరోసా సొమ్మును జమచేస్తోంది. కానీ ఎక్కడా కౌలు రైతుల ఊసేలేదు. పట్టాభూములను కౌలుకు తీసుకున్నా ఎక్కడా కూడా లిఖిత పూర్వకంగా హామీ పత్రాలు రాసివ్వడం లేదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పట్టాదారులు ప్రతీ ఏటా కౌలు రైతులను మారుస్తున్నారు. కౌలు రైతులకు అటు కేంద్రం ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి సాయం అందించకపోవడంతో అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి అప్పు తీసుకొచ్చి పంటలను సాగు చేస్తున్నారు. కౌలు రైతులకు కూడా పంట రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం బ్యాంకర్లకు స్పష్టంగా ఆదేశించినా వీరికి రుణాలు ఇచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

రైతు భరోసా ఇవ్వాలి



15 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి తదితర పంటలు పండిస్తున్నా. ఈ ఏడాది కౌలు రేటు పెంచారు. ఎకరానికి రూ.20 వేలు ఇస్తేగాని భూములు కౌలుకు ఇవ్వడం లేదు. సారవంతమైన నల్లరేగడి, బోరు బావులు కలిగిన భూముల ధర ఇంకా ఎక్కువగా ఉంది. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.

– కోదూరు శ్యాములు, కౌలు రైతు, పెద్దలోడి

క్లుప్తంగా

సత్తా చాటిన సంగారెడ్డి జట్టు


చరణ్

సంగారెడ్డి క్రైమ్: సిద్దిపేట పింక్ జట్టుపై సంగారెడ్డి బ్లూ జట్టు 87 పరుగుల తేడాతో విజయం సాధించింది. కొండాపురం మండలంలోని చీమలదరి కొనాపూర్ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బ్లూ జట్టు మొదటి బ్యాటింగ్ చేసి, నిర్ధారిత 45 ఓవర్ల మ్యాచ్‌లో 321 పరుగులకు 6వికెట్లను కోల్పోయింది. సిద్దిపేట్ల పింక్ బౌలింగ్‌లో బాబు 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన పింక్ జట్టు 45 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. పింక్ జట్టు బ్యాటింగ్‌లో ఇశాంత్ 80, పియల్ అభిరామ్ 61 పరుగులు చేశారు. సంగారెడ్డి జట్టులో తన బౌలింగ్‌తో ధనుష్, మహమ్మద్ అయాన్ 4వికెట్లు తీశారు. 147 పరుగులు చేసిన చరణ్‌కు మాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది.

క్రీడాపాఠశాలతో ఉజ్వల భవిష్యత్తు

జిల్లా అధికారి వెంకటనర్సయ్య


ప్రవేశాల కోసం ఎంపికలు

సిద్దిపేటజోన్: క్రీడాపాఠశాలల్లో చేరిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వెంకటనర్సయ్య పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడాపాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి సంబంధించి 4వ తరగతి ప్రవేశాల కోసం మంగళవారం స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో సిద్దిపేట విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి అధికంగా సీట్లు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మెరుగైన ఫలితాల సాధన కోసం విద్యార్థి దశ నుంచే క్రీడల్లో మంచి శిక్షణ పొందాలని సూచించారు. విద్యార్థుల బరువు, ఎత్తు, ఫ్లయింగ్ స్టార్స్, స్టాండింగ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్, వివిధ రకాల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా సమాఖ్య పరిశీలకులు ఫణీంద్ర, సిద్దిపేట అర్బన్ ఎంఐఓ రాజాప్రభాకర్ రెడ్డి, సమాఖ్య ప్రతినిధులు రామేశ్వర్ రెడ్డి, సుజాత, శ్రీనివాసులు, భిక్షపతి, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖాతా నుంచి డబ్బు కాజేశారు

శివ్వంపేట(నర్సాపూర్): ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే అతని బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులు పోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు... మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడం గ్రామానికి చెందిన భూషపోయిన బక్కయ్యకు గోమారంలోని గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉంది. అందులో ఉన్న రూ.60 వేలు డ్రా చేసేందుకు మంగళవారం బ్యాంకుకు వెళ్లగా ఖాతాలో డబ్బులు లేవని సిబ్బంది చెప్పడంతో అవాక్కయ్యాడు. ఖాతాలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు కాజేసిన విషయం కొడుకు వెంకటేశ్‌కు సమాచారం ఇవ్వడంతో బ్యాంకుకు వచ్చి తెలుసుకున్నాడు. రెండు విడతల్లో 30 వేల చొప్పున గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు కాజేసినట్లు బాధితుడు బక్కయ్య వాపోయాడు. బ్యాంకు మేనేజర్ వద్దకు వెళ్లగా ఖాతా నుంచి డబ్బులు ఎవరు కాజేశారనే విషయం బుధవారం పరిశీలించి వివరాలు అందజేస్తామని చెప్పినట్లు బాధితుడు చెప్పాడు.

ఇద్దరు నిందితులు రిమాండ్


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

దౌల్తాబాద్ (దుబ్బాక): ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని అహ్మద్‌నగర్ గ్రామంలో టి.షేక్ బాబాకు చెందిన బైక్‌ను ఈనెల 17న గుర్తు తెలియని దుండగులు తస్కరించారు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సోమవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు అనుమానితులను పట్టుకున్నారు. విచారణలో అహ్మద్ నగర్‌లో బైక్‌ను, తిమ్మక్కపల్లిలో బ్యాటరీని దొంగిలించినట్లు అంగీకరించారు. నిందితులిద్దరిని రిమాండ్‌కు పంపించారు.

పైసలిస్తేనే ప్లాట్!

- ఆటోనగర్ స్థలాల కేటాయింపులో దళారుల ఇష్టారాజ్యం
- కార్పొరేషన్ పెద్దలకు ముడుపులిచ్చామంటూ ప్రచారం
- అనర్హులకు కట్టబెడుతున్న వైనం
- న్యాయం చేయాలంటున్న బాధితులు


పటాన్‌చెరు టీఎస్‌ఐఐసీ కార్యాలయం

పటాన్ చెరు: ఔటర్ రింగ్ రోడ్డు, ఇతర నిర్మాణాల కారణంగా భూములు కోల్పోయిన చిన్న పరిశ్రమల యజమానుల కోసం మండలంలోని ఐనోల్ గ్రామ పరిధిలో టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో ప్లాట్లు ఏర్పాటు చేశారు. అక్కడ ప్లాట్లు పొందాలనుకుంటున్న వారి నుంచి దళారులు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ పెద్దలకు మూటలు అప్పగించామంటూ ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో అర్హులైన వారికి ప్లాట్లు కేటాయించాలని, అనర్హులకు కట్టబెట్టడం న్యాయం కాదని బాధితులు కోరుతున్నారు.


హైదరాబాద్‌లో ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం, ఇతర కారణాలతో వివిధ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన చిన్న పారిశ్రామికవేత్తలు ఒక సంఘంగా ఏర్పడ్డారు. అయితే సంఘంలో సభ్యత్వం లేని వారికి కూడా ప్లాట్లు ఇప్పిస్తామంటూ కొందరు దళారులు ప్రయత్నిస్తున్నారు. అయి తే భూములు కోల్పోయిన వారికి పటాన్ చెరు మండలం ఐనోల్ గ్రామంలో 20 ఎకరాల వెంచర్‌ను తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అభివృద్ధి చేయనుంది. ఆ గ్రామంలో అసైన్డ్ భూములను సేకరించిన 45 ఎకరాల విస్తీర్ణంలో ఆటోనగర్ ఏర్పాటు కాబోతోంది. ఇంకా రోడ్లు ఇతర మౌలిక వసతుల ఏర్పాటు పూర్తి కాలేదు. టీఆర్ఆర్ మెడికల్ కాలేజీ వెనుక వైపు స్థలాన్ని టీఎస్ఐఐసీకి గత ప్రభుత్వంలోనే అప్పజెప్పారు. టీఎస్ఐఐసీ 200 గజాల నుంచి ఆరు వందల గజాల ప్లాట్లు తయారు చేసి విక్రయించనున్నా రు. అయితే 20 ఎకరాల భూమిని సంఘం సభ్యులకు కేటాయిస్తూ అధికారులు మంజూరిచ్చారు. ఆ సంఘానికి సంబంధించిన ప్లాట్లను దళారులు అమ్ముకుంటున్నారని సభ్యుల మధ్య వివాదం మొదలైంది. సభ్యులకు ప్లాట్లు ఇచ్చేందుకు రూ.2లక్షల నుంచి 6 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు వినికిడి.

స్థానిక నేతల వద్ద పంచాయితీ

అర్హులైన తమకు కాదని వేరే వ్యక్తులను ఇండస్ట్రియల్ సొసైటీలో చేర్చి ప్లాట్లు ఇప్పిస్తామని చెప్పడం తగదంటూ కొందరు స్థానిక నాయకులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలని పంచాయితీ పెట్టారు. ఆ వివాదం ఎమ్మెల్యే వద్దకు చేరింది. ఆటోనగర్ ఏర్పాటుకు విశేషంగా కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన వద్దకు వచ్చిన ఆ సంఘం ప్రతినిధులను హెచ్చరించారు. అనవసరంగా రచ్చ చేసుకోవద్దని హితవు పలికారని తెలిసింది. అయినప్పటికీ దళారులు తమ ఇష్టానుసారంగా ప్లాట్లు ఇప్పిస్తామంటూ బీరాలు పోతున్నట్లు బాధితులు వాపోతున్నారు. అంతే కాకుండా కార్పొరేషన్ పెద్దలకు పెద్ద ఎత్తున ముడుపులు అందజేశామని దళారులు బహిరంగంగా ప్రచారం చేస్తున్నారు. ఈ విషయమై సంఘం ప్రతినిధి శ్రీనివాస్‌ను సాక్షి వివరణ కోరగా ఆలాంటిదేమీ లేదని తెలిపారు. సభ్యుల వద్ద సొమ్ము తీసుకోవాల్సిన అవసరం తమకు లేదని వివరించారు.

భూ సమస్య పరిష్కరించాలని హల్‌చల్

- ఎలుకల మందుతో విద్యుత్ స్తంభమెక్కిన రైతు
- గంటపాటు ఆందోళన.. పోలీసుల హామీతో కిందకు


స్తంభమెక్కి నిరసన తెలుపుతున్న సిద్దిరాములు

హవేళిఘణాపూర్(మెదక్): తాము కబ్జాలో ఉన్న భూమి వేరే వ్యక్తి పేరు మీద ఉందని, తన పేరు మీద చేయాలని అధికారులకు పలు మార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించలేదని మంగళవారం ఓ రైతు విద్యుత్ స్తంభం ఎక్కి నిరసన తెలిపాడు. వివరాలిలా ఉన్నాయి. హవేళిఘణాపూర్ గ్రామానికి చెందిన సాదుల సిద్దిరాములు తొగుట శివారులో నక్కవాగు వద్ద తన తండ్రి పేరున వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మెదక్ పట్టణానికి చెందిన శ్యాంసుందర్ తన భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించాడు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీంతో బాటిల్‌లో ఎలుకల మందు కలుపుకొని తన పొలం వద్ద ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సింధూరేణుక, పట్టణ సీఐ రాజారెడ్డి కిందకు వస్తే సమస్య పరిష్కరిస్తామని నచ్చజెప్పినా వినలేదు. ఎస్పీ, కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరిస్తే దిగుతానంటూ గంటపాటు ఆందోళన చేశాడు. చివరకు సీఐ రాజారెడ్డి ఆందోళన చేస్తే లాభం లేదని, కిందకు వస్తే పరిష్కరిస్తామని బతిమిలాడటంతో కిందికి దిగాడు. దీంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు సరఫరా నిలిపివేయడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా, ఇంతలో అక్కడే ఉన్న సిద్దిరాములు చేతిలో ఉన్న ఎలుకల మందు కలిపిన బాటిల్‌ను ఆయన సోదరి మాధవి తీసుకొని తాగింది. దీంతో వెంటనే ఆమెను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకోవాలి


మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీఓ సుధీర్

తొగుట(దుబ్బాక): అందివచ్చిన అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ సుధీర్ తెలిపారు. మండల కేంద్రమైన తొగుటలోని ఎంఎస్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సంఘం పదాధికారులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం, మహిళా శక్తి క్యాంటీన్లు, మహిళా శక్తి బజార్, విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టడం, సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తుందన్నారు. మొబైల్ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్లు, ఆర్టీసీ బస్సులు, జిల్లా సమాఖ్యల ద్వారా పెట్రోల్ బంకులు, లోన్ ఇన్సూరెన్సులు, బీమా వంటి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మహిళలు మరింత ఆర్థికంగా ఎదగడానికి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, డీపీఎం విద్యాసాగర్, వాసుదేవ్, సీఆర్‌పీలు సరస్వతి, రేణుక, సీసీఎస్‌లు భాస్కర్, రజనీ, విజయ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల నుంచి పారిపోయేందుకు యత్నం

- ప్రమాదవశాత్తు కిందపడిన విద్యార్థిని
- తలకు తీవ్ర గాయాలు.. గాంధీలో చికిత్స

మునిపల్లి(అందోల్): కేజీబీవీ నుంచి పారిపోయే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డ విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కవిత వివరాల ప్రకారం... సదాశివపేట మండలం అంకెనపల్లి గ్రామానికి చెందిన జనార్దన్, అనిత కూతురు భవానిని ఈ నెల 20న సంగారెడ్డి నుంచి తాటిపల్లి కేజీబీవీలో 9వ తరగతిలో జాయిన్ చేశారు. 21న మా ఇంటికి వెళ్లి అమ్మ దగ్గరే ఉంటూ చదువుకుంటానంటూ మారాం చేసింది. 22న కేజీబీవీ ఉపాధ్యాయులు భవానీ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. త్వరలో కేజీబీవీకి వచ్చి భవానీతో మాట్లాడతానని తల్లి అనిత చెప్పింది. అయినా భవానీ ఏడ్వడం, మారాం చేయడం మానలేదు. ఈ నెల 23న ఉదయం 11 గంటలకు పాఠశాలలో ఇంటర్‌వెల్ బెల్ సమయంలో విద్యార్థులంతా బయటకు వచ్చారు. వారితో పాటు భవానీ వచ్చి పారిపోయేందుకు పైపులైన్ గోడ పట్టుకుని వెళ్లే ప్రయత్నంలో జారి ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. దీంతో ఆమె తలకు గాయం కావడంతో ఏఎన్ఎం, ఉపాధ్యాయులు వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్, చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉందని, అందరితో మాట్లాడుతుందని ఏఎన్ఎం సంగీత తెలిపారు.

జల్సాలకు అలవాటై చోరీలు

నిందితుల అరెస్ట్

- 15 బైకులు, బంగారం, వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రభాకర్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పటాన్‌చెరు టౌన్: జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్న ముగ్గురు నిందితులతోపాటు వారికి సహకరించిన మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ప్రభాకర్ వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నవపాన్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఒకే బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని పట్టుకుని విచారించగా విషయం బయటకు వచ్చింది. సంగారెడ్డి జిల్లా...కంది జైలులో నర్సాపూర్‌కు చెందిన వడ్డె శివకుమార్, హైదరాబాద్ మణికొండకు చెందిన మహేందర్ రెడ్డి, పటాన్‌చెరు చిట్కుల్‌కు చెందిన గణేష్‌కు పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటకు వచ్చాక ఇస్నాపూర్, చిట్కుల్‌లో నివాసం ఉంటూ జల్సాలకు అలవాటు పడ్డారు. ఇస్నాపూర్, ముత్తంగి, ఇంద్రకరణ్, కేపీహెచ్‌బీ, బీదర్ జిల్లాలో వైన్స్ షాపుల ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌లను, ఇళ్ల తాళాలను పగలగొట్టి బంగారం, వెండి దొంగతనం చేసి అమ్ముకుంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరికి సహకరించిన చిట్కుల్‌కు చెందిన అనిల్ సింగ్, నరేష్, వడ్ల బ్రహ్మం, గోపన్‌పల్లి నరసింహులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 20 లక్షల విలువ చేసే 15 బైక్‌లు, బంగారం, కిలో వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులు శివకుమార్‌పై 57 కేసులు, మహేందర్ రెడ్డిపై 25 కేసులు కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన ఏడుగురిని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మహిపాల్‌రెడ్డిని త్వరలో పట్టుకుంటామన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన సీఐ వినాయక్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు, సీసీఎస్ సీఐ శివకుమార్, సీసీఎస్ - 2 రామానాయుడు, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, పటాన్‌చెరు ఎస్ఐ ఆసిఫ్ అలీ, కానిస్టేబుల్స్‌ను ఎస్పీ పంకజ్ అభినందించారు.

దొంగతనం కేసులో నలుగురు రిమాండ్

పటాన్‌చెరు టౌన్: దొంగతనం కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌లో ఈ నెల 18వ తేదీన ఆఫీస్ వర్క్ స్టేషన్ కంపెనీలో మూడు ల్యాప్‌టాప్‌లు, రెండు ప్రింటర్లు, ఒక సెల్‌ఫోన్, డ్రిల్లింగ్ మిషన్, గ్రైండింగ్ మిషన్‌లను, సుప్రీం ఇంటీరియర్‌లో బ్యాటరీ, ఇన్వెంటర్, 30 మీటర్ల కాపర్ కాయిల్స్, అల్యూమినియంను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించగా బొలెరో వాహనంలో వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. గోల్డెన్‌కి చౌరస్తా వద్ద పోలీసులు వాహన తనిఖీ నిర్వహిస్తుండగా బొలెరో వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంతో పాటు రాజేంద్రనగర్ కాటేదాన్‌కి చెందిన రంజన్ కుమార్, శశి కుమార్ యాదవ్,అబే చౌదరితో పాటు మరో మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు చోట్ల దొంగిలించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. పరారీలో ఉన్న మరో మైనర్‌ని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- నలుగురు నిందితుల అరెస్టు
- రూ. 6 లక్షల విలువైన వస్తువుల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. మెదక్ పట్టణం తారకరామా నగర్‌లో నివాసం ఉండే కూర శేఖర్ హైదరాబాద్‌లో ఉండే బంధువుల వద్దకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇంట్లో దొంగలు పడి బీరువాలో ఉన్న రూ.10 లక్షలు, బంగారం, వెండితోపాటు కారును కూడా అపహరించారు. ఈ నెల 8న ఇంటి ముందు ఉన్న కారు కనిపించకపోవడంతో, పని మనిషి ఇంటి యజమానికి సమాచారం ఇచ్చింది. దీంతో ఇంటికి చేరుకున్న శేఖర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో ఉంచిన 15 తులాల బంగారం, 4.5 కిలోల వెండి సామగ్రి, 3 కెమెరాలు, కీ ప్యాడ్, శాంసంగ్ ప్యాడ్, 326 అమెరికా డాలర్స్, అమెరికన్ సెంట్స్ చోరీకి గురైనట్టు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తుండగా చోరీకి గురైన కారు ఈ నెల 19న కోదాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చిక్కింది. కారులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా.. హైదరాబాద్‌లోని మల్కాజిగిరికి చెందిన తిరుమలేష్ ప్రధాన నిందితుడుగా గుర్తించారు. కోదాడలో పోలీసులు అదుపులోకి తీసుకున్న బాల నేరస్తుడిని జువెనల్ బోర్డుకు పంపించారు.

వాహనాల తనిఖీలో చిక్కిన దొంగలు

ఈ క్రమంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న గుడాల తిలక్, గుడ్డు రాజులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద ఆరు లక్షల వరకు విలువైన బంగారు, వెండి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు తిరుమల్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఇతనిపై నల్గొండ, ఇతర జిల్లాల్లో 15కు పైగా కేసులు ఉన్నాయి. చోరీ కేసును త్వరగా ఛేదించిన మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ సీఐ మహేష్, ఎస్ఐ అమర్, పీసీలు నర్సింహులు, నిఖిల్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజా రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


మచ్చూరి లక్ష్మయ్య

పాపన్నపేట(మెదక్): టూవీలర్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. మండలంలోని జూకల్‌కు చెందిన మచ్చూరి లక్ష్మయ్య (67) మోపెడ్‌పై టేక్మాల్ మండలం గొల్లగూడెం గ్రామానికి వెళ్లి అక్కడ తన పని చూసుకొని పాపన్నపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో మండల శివారులోని పెట్రోల్ బంకు సమీపంలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు..

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రం శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం.. కోమటిపల్లి గ్రామానికి చెందిన దేవమ్మ (58) జాతీయ రహదారి దాటుతుండగా ప్రేమ్‌చంద్ అనే యువకుడు బైక్‌పై అతి వేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దేవమ్మను మెదక్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

సిద్దిపేట జిల్లాలో ఘటన


నర్సింహులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలానికి చెందిన రాగుల(బోడిమిద్ది) నర్సింహులు(36), లక్ష్మీ దంపతులు. వీరికి కూతురు మీనాక్షి, కుమారుడు వరుణ్ ఉన్నారు. గ్రామంలో రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. దీంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. రెండు, మూడేళ్ల నుంచి వ్యవసాయ పెట్టుబడి కోసం, కుటుంబ పోషణకు సుమారు రూ.6 లక్షల వరకు అప్పులయ్యాయి. ఓ వైపు అప్పులు తీరక మరో వైపు అప్పులు పుట్టక కొద్ది రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం భార్యకి పొలం దాకా వెళ్లి పాడి గేదెను కట్టేసి వస్తానని వెళ్లాడు. రాత్రి తొమ్మిదైనా ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మి, కుమారుడితో కలిసి పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే ప్రైవేట్ వాహనంలో గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పని చేయడం ఇష్టంలేక యువకుడు..

సిద్దిపేటకమాన్: పనిచేయడం ఇష్టం లేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం..సిద్దిపేట డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన రామగిరి సుగుణకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రాకేష్ (34)తో కలిసి సుగుణ స్థానికంగా నివాసం ఉంటుంది. రాకేష్ నెల రోజుల నుంచి వర్గల్ గ్రామంలోని ఓ కంపెనీ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం అమ్మమ్మ మృతి చెందడంతో అందరూ స్వగ్రామానికి వెళ్లారు. ఈ నెల 23న రాకేష్ అక్కడి నుంచి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వచ్చాడు. సుగుణ మంగళవారం ఇంటికి వచ్చి చూడగా రాకేష్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'పొదుపు' అవకతవకలతో..


పద్మ

పాపన్నపేట(మెదక్): మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... పొడిచన్‌పల్లి గ్రామంలో జరిగిన స్వయం సహాయక గ్రూపుల ఆర్థిక అవకతవకల్లో వీఓఏ పద్మ(55)తోపాటు సీసీ నిర్లక్ష్యంగా ఉన్నట్లు విచారణలో అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు సీసీని సస్పెండ్ చేశారు. అనంతరం పద్మ నుంచి అధికారులు రికవరీ చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆమెపై ఒత్తిళ్లు ప్రారంభమైనట్లు తెలుస్తుంది. అయితే పద్మ మంగళవారం బయటకు వెళ్లొచ్చిన అనంతరం ఇంట్లో ఉరి వేసుకుంది. ఆత్మహత్యకు ముందు లేఖ రాసినట్లు సమాచారం. అందులో ముగ్గురు సంబంధిత శాఖకు సంబంధించిన అధికారుల పేర్లు, తోటి ఉద్యోగి పేరు, ఇద్దరు బ్యాంకు అధికారుల పేర్లు , మరో వ్యక్తి పేరు ఉన్నట్లు తెలిసింది. వీరికి తాను డబ్బులు ఇచ్చినట్లు ఆమె లేఖలో ఆరోపించినట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొలానికి వెళ్తుండగా ఆభరణాలు చోరీ.. హత్య


సత్తమ్మ(ఫైల్)

గజ్వేల్‌రూరల్: మహిళ మెడలోంచి బంగారు ఆభరణాలను చోరీ చేయడంతో పాటు హత్య చేశారు. ఈ ఘటన గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామంలో కలకలం సృష్టించింది.సీఐ సైదా వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సత్తమ్మ(70) రోజు మాదిరిగానే మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని రైల్వేట్రాక్ సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో సమీపంలోని రైతు తమ పొలానికి వెళ్తుండగా రక్తపుమడుగులో విగతజీవిగా పడిఉన్న సత్తమ్మను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలంలో సత్తమ్మ ఒంటిపై ఉన్న మూడు తులాల బంగారు గొలుసు, చెవికమ్మ చోరీకి గురవగా, మెడపై పదునైన ఆయుధంతో దాడి చేసి పొడిచినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

జోరుగా మట్టి దందా

- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- సమాచారం ఇచ్చేందుకు జంకుతున్న ప్రజలు


తిప్పారం శివారులోని కాలువ మట్టిని టిప్పర్‌లో లోడ్ చేస్తున్న జేసీబీ

కొండపాక(గజ్వేల్): అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం మూలంగా అక్రమ మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వెంచర్లు, ఇతరత్ర పనుల కోసం మట్టిని తరలిస్తున్నారు. మండల పరిధిలోని తిప్పారం, ముద్దాపూర్, తిమ్మారెడ్డిపల్లి, కొండపాక గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లోని గుట్టలను తోడేస్తున్నారు. అలాగే మల్లన్న సాగర్ కాలువ నిర్మాణంలో తవ్విన మట్టిని, శామీర్‌పేట, గజ్వేల్ పట్టణ శివారులో వెలుస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయల్లో దందా సాగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో ఉన్న గుట్ట నుంచి, తిప్పారం, ముద్దాపూర్ శివారులో మల్లన్న సాగర్ కాలువ మట్టిని టిప్పర్ల ద్వారా అక్రమార్కులు తరలిస్తున్నారు. నిత్యం రాజీవ్ రహదారిపై తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువవ్వడంతో జోరుగా మట్టి దందా సాగుతోంది. ఒక వేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు వారి పేర్లు బయటపెడుతుండటంతోపాటు, అక్రమార్కుల బెదిరింపులకు గురికావల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో సెలవు దినాల్లో మట్టిని తరలిస్తున్నారు. మట్టి లోడుతో టిప్పర్లు స్పీడుగా వెళ్తుండటంతో గాలికి మట్టి వెనుకాల వెళ్తున్న ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడి ఇబ్బందులు పడుతున్నారు. కాలువ వద్ద జరుగుతున్న మంటి దందా విషయాన్ని కుకునూరుపల్లి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా ఇరిగేషన్ శాఖ అధికారులు చూసుకుంటారంటూ దాటవేసే ధోరణితో మాట్లాడటం గమనార్హం. రెండు రోజుల కింద తిప్పారం శివారులో కాలువ మట్టిని టిప్పర్లతో తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకొని వదిలివేశారన్న ప్రచారం సాగుతోంది. ఈ విషయమై తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా టిప్పర్లను పట్టుకున్న మాట వాస్తవమేనని, అనుమతి తీసుకున్నాక రవాణా చేస్తామనడంతో వదిలేశామని చెప్పారు.


ముద్దాపూర్ శివారులో మల్లన్న సాగర్ కాలువ నుంచి మట్టిని తీయడంతో తరిగిపోయిన పెద్ద కుప్ప